వచ్చారు.. వెళ్లారు..!

- కొండకెంగువకు ఎంపీ కలిశెట్టి వెళ్లి, 8 నెలలు
- అప్పట్లో మౌలిక సదుపాయాల కల్పనకు హామీ
- కనీసం రోడ్లు, విద్యుత్, తాగునీరు కల్పించని వైనం
- తీవ్ర అవస్థలు పడుతున్న గ్రామస్తులు


జీలికవలస గిరిజన గ్రామంలో పర్యటిస్తున్న ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు(ఫైల్)


అధ్వానంగా కొండకెంగువ-జీలికవలస గ్రామ మట్టిరోడ్డు

రామభద్రపురం:

మండలంలోని కొండకెంగువ పంచాయతీలో ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు పర్యటించి, నేటికి ఎనిమిది నెలలు కావస్తోంది. 2024 జూలై 16వ తేదీన ఇదే పంచాయతీలోని జీలికవలస గిరిజన గ్రామంతో పాటు, కొండకెంగువ గ్రామానికి వెళ్లిన ఆయన, అక్కడి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో కొండకెంగువ నుంచి జీలికవలస గ్రామానికి తారురోడ్డు వేయాలని, ఏడొంపుల గెడ్డపై వంతెన నిర్మించాలని, శిథిలావస్థకు చేరిన చెక్‌డ్యామ్ మరమ్మతులు చేపట్టాలని, సాగునీటి కాలువలు బాగుచేయాలని, జీలికవలసలో శాశ్వత అంగన్‌వాడీ కేంద్ర భవనం నిర్మించాలని, గ్రామంలో ప్రాథమిక పాఠశాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని, పొలాల్లో నివాసముంటున్న వారి ఇళ్లకు రోడ్లు, కాలువలు, విద్యుత్ కల్పించాలని ఇలా.. అన్నీ సమస్యలను గ్రామస్తులు ఎంపీకి విన్నవించారు.

హామీలిచ్చి.. మరిచారు..

కొత్తగా ఎంపీ అయిన ఉత్సాహంలో క్షేత్ర పర్యటనలో భాగంగా కొండకెంగువ పంచాయతీలోని జీలికవలస, కొండకెంగువ గ్రామాలకు వెళ్లిన ఎంపీ కలిశెట్టి.. గ్రామస్తులకు హామీల వర్షం కురిపించారు. అయా గ్రామాల ప్రజలు అడిగినవన్నీ చేసేస్తానని హామీ ఇచ్చారు. అయితే ఇంతవరకు ఆయన ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటి నెరవేర్చకపోవడంపై గ్రామస్తులు పెదవి విరుస్తున్నారు. వచ్చారు.. వెళ్లారు.. అంతే.. హామీలేవీ అమలు చేయలేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పొలాల్లో నివాసముంటున్న గ్రామస్తులు కొంతమంది రాత్రి అంతా చీకట్లో మగ్గుతున్నా ఎంపీకి పట్టడం లేదా అని, అయనే స్వయంగా వచ్చి సమస్యలు చూసినా స్పందించాలనే ఆలోచన రాలేదా అని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఇచ్చిన హామీలు నిలబెట్టుకునే దిశగా ఆలోచన చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.


జీలికవలసలో అంగన్‌వాడీ కేంద్రం నిర్వహిస్తున్న రేకుల షెడ్డు


శిథిలావస్థలో ఏడొంపుల గెడ్డ చెక్‌డ్యామ్


పూడికలతో కొండకెంగువ చెక్‌డ్యామ్ ఎడమ కాలువ

సాగునీటికి ఇబ్బందులు పడుతున్నాం..



మా గ్రామ ఏడొంపుల గెడ్డలో నిర్మించిన చెక్‌డ్యామ్ ఇప్పుడు శిథిలావస్థకు చేరింది. దీంతో నీరు నిల్వ ఉండడం లేదు. లీకుల ద్వారా నీరంతా బయటకు పోతోంది. అలాగే కుడి, ఎడమ సాగునీటి కాలువలు పూడికలతో నిండిపోయి సాగునీరు అంతగా ప్రవహించని పరిస్థితి. ఈ సమస్యలన్నింటినీ మా గ్రామ పర్యటనకు వచ్చిన ఎంపీ ముందు ఉంచాం. ఆయన కూడా సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు. మేమంతా సంతోషించాం కానీ ఇప్పటికీ హామీ నెరవేరలేదు.

– బెల్లాన ప్రసాదరావు, వైస్ ఎంపీపీ, కొండకెంగువ గ్రామం

ఏ హామీ నేరవేర్చలేదు..



ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు దృష్టికి మా గ్రామ సమస్యలు తీసుకువెళ్లాం. ఆయన మా గ్రామం వచ్చి 8 నెలలైంది. ఇప్పటివరకు ఆయన ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ నెరవేర్చలేదు. మా గ్రామంలోని విద్యార్థులు జుమ్ములవలస పాఠశాలకు వెళ్తున్నారు. అలాగే రేకుల షెడ్డులో అద్దెకు అంగన్‌వాడీ కేంద్రం నిర్వహిస్తున్నారు. ఈ సమస్యలన్నీ ఎంపీకి చెప్పాం. ఆయనకు కూడా పరిష్కరిస్తామని చెప్పారు.

– నందేల లక్ష్మణరావు, జీలికవలస గ్రామం

ముస్లింల శాంతియుత ర్యాలీ

వక్ఫ్‌బిల్లు సవరణను వ్యతిరేకిస్తూ ముస్లింలు శాంతియుత ర్యాలీ నిర్వహించారు. రాజాంలోని బొబ్బిలి జంక్షన్ వద్ద సోమవారం మానవహారంగా ఏర్పడి, కేంద్రం తీరును తప్పుబట్టారు. ఎంతో పటిష్టంగా ఉండే వక్ఫ్‌బోర్డు చట్టాలను సవరించాలనుకోవడం సమంజసం కాదన్నారు. కొత్తగా చేసే బిల్లు సవరణతో ముస్లింల ఆస్తుల పరిరక్షణపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. ఇప్పటికైనా చట్ట సవరణ నిర్ణయం వెనక్కి తీసుకోవాలని ప్రధాని మోదీకి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎస్‌కే ఇమాముద్దీన్, ఎస్‌కే మోహముద్దీన్, ఎస్‌కే భాషా, ఎస్‌కే మదీనా, ఎస్‌కే హుస్సేన్, ఎస్‌కే అబ్దుల్ రెహ్మాన్, ఎస్‌కే ఖాసిమ్ తదితరులు పాల్గొన్నారు. – రాజాం



మలుపు.. ప్రమాదానికి పిలుపు!



కొన్నిచోట్ల రోడ్లు మలుపులు ప్రమాదాలకు పిలుపులుగా మారాయి. ముఖ్యంగా రేగిడి మండలంలోని సోమరాజుపేట-వన్నలి రోడ్డు మలుపు అయితే మరీ ప్రమాదకరంగా కనిపిస్తోంది. రహదారి వంపు అధికంగా ఉండడంతో అదుపు తప్పి వాహనదారులు పడిపోయి గాయాలపాలవుతున్నారు. కొంతదూరం వెళ్తే మలుపు ఉందని అప్రమత్తం చేస్తూ ఎటువంటి హెచ్చరిక బోర్డు లేదని, కనీసం స్టాపరు కూడా పెట్టలేదని వాహనదారులు, ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి, చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. – రేగిడి

కుచించుకుపోతున్న సాయన్నచానల్

ఆక్రమణల కారణంగా రేగిడి మండలంలోని సాయన్నచానల్(సాగునీటి కాలువ) కుచించుకుపోతోంది. గతంలో 30 మీటర్ల వెడల్పు ఉండే ఈ కాలువ ప్రదేశాన్ని పలుచోట్ల ఆక్రమణదారులు ఆక్రమించుకోవడంతో సాగునీరు సక్రమంగా సరఫరా కావడం లేదు. దీంతో ఆయకట్టు, శివారు ప్రాంతాల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆక్రమణలు తొలగించడంతో పాటు కాలువను బాగుచేసి పంటలకు సాగునీరందించాలని అభ్యర్థిస్తున్నారు. ఈ చిత్రంలో రేగిడి వద్ద తక్కువ విస్తీర్ణం కలిగిన కాలువను చూడొచ్చు. – రేగిడి



పేదలకు భోజనం అందజేత

వంగర: నిత్యాన్నదాన కార్యక్రమంలో భాగంగా మండలంలోని కె.కొత్తవలస గ్రామంలోని పేదలకు భోజనం సోమవారం అందజేశారు. తిరుపతికి చెందిన నవజీవన్ ట్రస్ట్ ఆర్థికసాయంతో కొప్పరవలస సత్యసాయి నిత్యాన్నదాన సత్రం నుంచి ప్రతిరోజూ ఇలా పేదలకు క్యారేజీలతో భోజనం అందిస్తామని ట్రస్ట్ చీఫ్ మేనేజర్ సాదెం వెంకటరమణ తెలిపారు.

క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ పెన్షనర్ల నియోజకవర్గ అధ్యక్షుడిగా శ్యామ్


పాలవలస శ్యామ్

రాజాం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంప్లాయిస్, పెన్షనర్ల రాజాం నియోజకవర్గ అధ్యక్షుడిగా రాజాం పట్టణానికి చెందిన పాలవలస శ్యామ్ నియమితులయ్యారు. ఈ విషయాన్ని సోమవారం రాజాం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ తలె రాజేష్ వెల్లడించారు. ఈ సందర్భంగా పాలవలస శ్యామ్‌ను పలువురు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, అభిమానులు అభినందించారు.

వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శిగా రామారావు


గర్భాపు రామారావు

తెర్లాం: వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శిగా తెర్లాం మండలంలోని కాగాం గ్రామానికి చెందిన గర్భాపు రామారావును నియమిస్తూ ఆ పార్టీ కేంద్ర కార్యాలయం సోమవారం ప్రకటించింది. పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఎస్సీ సెల్ కార్యదర్శిగా తన నియామకానికి కృషి చేసిన పార్టీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు, బొబ్బిలి మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడులకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానన్నారు. రామారావు నియామకం పట్ల పార్టీ నాయకులు, కార్యకర్తలంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బీసీ కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు రేపు

రాజాం సిటీ: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 2వ తేదీన బీసీ కార్పొరేషన్ రుణాలకు సంబంధించి, ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు ఓ ప్రకటనలో సోమవారం తెలిపారు. ఎం.ఎం.ఎస్ ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు మాత్రమే ఇంటర్వ్యూ ఉంటుందన్నారు. దరఖాస్తు ఫారం, ఆధార్, కులం, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో పాటు ఒక జిరాక్స్ సెట్ తీసుకురావాలన్నారు. ఉదయం 10 గంటల నుంచి ఆగూరు, అంతకాపల్లి, ఎంజేవలస, బొద్దాం, డీఆర్‌ఎన్‌వలస, జీసీహెచ్ పల్లి, గడిముడిదాం, గురవాం, ఒమ్మి గ్రామాల దరఖాస్తుదారులకు, అదేరోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి రాజయ్యపేట, సోపేరు, పెనుబాక, పొగిరి, కంచరాం సచివాలయాల పరిధిలోని దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూ చేయడం జరుగుతుందన్నారు. మండలానికి మంజూరైన 83 యూనిట్లకు గాను మొత్తం 480 మంది దరఖాస్తు చేశారన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హుల ఎంపిక ఉంటుందన్నారు.

పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సూర్యారావు తదితరులు

రాజాం సిటీ: ప్రజల్లో ఆధ్యాత్మికత వెల్లివిరిసేందుకు భజన గీతాలు ఎంతగానో దోహదపడతాయని లెంక సూర్యారావు అన్నారు. సోమవారం రాత్రి మండలంలోని మొగిలివలస గ్రామంలో సూర్యారావు రాసిన భజన గీతాల పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఒకప్పుడు ఎంతో ప్రాచుర్యం పొందిన భజనలు నేడు కనుమరుగవుతున్నాయని, వాటిపై యువత ఆసక్తి చూపినప్పుడే ఆరోగ్యంతో పాటు ఆధ్యాత్మికత పెరుగుతుందన్నారు. యువత సన్మార్గంలో నడిచేందుకు ప్రతి గ్రామంలో భజనలు చేయడంతో పాటు ప్రోత్సాహక పోటీలు నిర్వహించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో మజ్జి సత్యం తదితరులు పాల్గొన్నారు.

సన్మానం


వేణుగోపాల్‌ను సత్కరిస్తున్న వికాస తరంగిణి సభ్యులు

రాజాం సిటీ: మండలంలోని కంచరాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు పండూరు వేణుగోపాల్‌ను సోమవారం ఘనంగా సత్కరించారు. వికాస తరంగిణి సెంట్రల్ ఆర్గనైజింగ్ కార్యదర్శి టీటీవీ రమణమూర్తి మాట్లాడుతూ వేణుగోపాల్ తీసిన ఫొటోకు జాతీయ స్థాయిలో ప్రథమ స్థానం దక్కడం గర్వించదగ్గ విషయమన్నారు. బహుళ కాంతి ధర్మాలు ఒకే ఫ్రేమ్‌లో వివరించిన ఈ ఫొటోకు ఈ ప్రాంతం నుంచి బహుమతి రావడం అభినందనీయమన్నారు. భవిష్యత్తులో మరిన్ని ప్రయోగాలతో మంచి గుర్తింపు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వికాస తరంగిణి సభ్యులు గడే అప్పలనాయుడు, పెంకి చైతన్యకుమార్, మురపాక గణేష్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

రేగిడి: మండలంలోని లింగాలవలస సర్పంచ్ గొర్జాన అప్పలనాయుడు వదిన గొర్జాన గౌరీశ్వరిని మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్‌లు పరామర్శించారు. ఇటీవల గౌరీశ్వరి అనారోగ్యానికి గురై పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందిన అనంతరం ఇంటి వద్దనే కోలుకుంటున్న విషయం తెలుసుకున్న సదరు నేతలు.. సోమవారం ఆ గ్రామానికి వెళ్లి, గౌరీశ్వరితో పాటు ఆమె భర్త సత్యంనాయుడు, సర్పంచ్ అప్పలనాయుడులను కలిసి ఆమె ఆరోగ్యంపై ఆరాతీశారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ టంకాల అచ్చెన్నాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు వావిలపల్లి జగన్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.


సర్పంచ్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎంపీ బెల్లాన, డాక్టర్ రాజేష్

మెంటాడ: మండలంలోని బడేవలస గ్రామ వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు మీసాల గురునాయుడు సతీమణి, సర్పంచ్ పార్వతమ్మ(48) సోమవారం ఉదయం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర.. ఆ గ్రామం వెళ్లి, బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చి, ప్రగాఢ సానుభూతి తెలిపారు.


మెంటాడ: సర్పంచ్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర

పార్వతమ్మ ఆకస్మిక మరణం చాలా బాధాకరమని, ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ఆరాధించారు. కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు రాయిపల్లి రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఈకేవైసీకి గడువు పొడిగింపు

బాడంగి: రేషన్‌కార్డుదారులకు ఈకేవైసీ చేయించుకునేందుకు ప్రభుత్వం గడువు పొడిగించినట్లు సీఎస్‌డీటీ స్వర్ణలత ఓ ప్రకటనలో సోమవారం తెలిపారు. ప్రస్తుత గడువు మార్చి నెలాఖరుతో ముగియగా, ఏప్రిల్ 30వ తేదీ లోగా చేయించుకోవాలని ప్రభుత్వం సూచించినట్లు పేర్కొన్నారు.

జోరుగా పన్నుల వసూళ్లు

బొబ్బిలి: పట్టణంలో పన్నుల వసూళ్లు జోరుగా జరుగుతోంది. ప్రజలు బకాయిపడిన ఆస్తిపన్ను సహా ఇతర పన్నులను మున్సిపల్ అధికారులు వసూలు చేస్తున్నారు. బకాయిలు పెండింగ్ ఉన్న వారి వద్దకు వెళ్లి, బకాయి పన్నుల వడ్డీ చెల్లింపులో కల్పిస్తున్న 50 రాయితీ సదుపాయాన్ని తెలిపి, పన్నులు చెల్లించేందుకు చొరవ చూపేలా చేశారు. మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి ఈ పన్నుల వసూళ్లను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు.

వస్త్రదానం

సంతకవిటి: మండలంలోని తాలాడ గ్రామంలో ఉన్న 70 మంది వృద్ధులకు రాజాం మున్సిపాలిటీ పరిధిలోని పొనుగుటివలస గ్రామానికి చెందిన విశ్రాంత వ్యవసాయ సహాయ సంచాలకులు ఎస్వీ రమణ సోమవారం వస్త్రదానం చేశారు. తమ తల్లిదండ్రుల జ్ఞాపకార్థం తువ్వాళ్లు, చీరలు, ధోవతీలు, దుప్పట్లు పంపిణీ చేశామని ఆయన పేర్కొన్నారు.

శ్రీరామనవమి పూజలు ప్రారంభం

బాడంగి: శ్రీరామనవమి పూజలు ప్రారంభమయ్యాయి. స్థానిక కోదండరామ ఆలయంలో సోమవారం స్వామి వారికి అర్చనలు, అభిషేకాలు చేయడంతో పాటు రుద్రహోమం, సహస్రనామార్చన, వేదస్వస్తి పూజలు చేశారు. తొమ్మిది రోజుల పాటు జరిగే నవరాత్రి ఉత్సవాల్లో ఈ నెల 7వ తేదీ సాయంత్రం సీతారాముల కల్యాణ మహోత్సవం, 8వ తేదీ రాముని పట్టాభిషేకం నిర్వహిస్తామన్నారు. అదేరోజు మధ్యాహ్నం అన్నదానం కార్యక్రమం చేపడతామన్నారు.

ఘనంగా రంజాన్ వేడుకలు


బొబ్బిలిలోని జామియా మసీదులో రంజాన్ ప్రార్థనల్లో ముస్లిం సోదరులు

ముస్లిం సోదరులు రంజాన్ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించుకున్నారు. మానవత్వానికి, సౌభ్రాతృత్వానికి ప్రతీకగా నిలిచే ఈ పండగను ఇస్లాం క్యాలెండర్ ప్రకారం రంజాన్ మాసంలో ఏటా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. దాదాపు నెల రోజుల ఉపవాస దీక్షల అనంతరం వచ్చే ఈ పవిత్రమైన రోజున ముస్లింలంతా మసీదులకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సాయంత్రం ఇఫ్తార్ విందు ఆరగించి దీక్షలు విరమించారు. అనంతరం పేదలకు దానధర్మాలు చేశారు. అల్లా ఆశీస్సులు అందరిపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు.

–బొబ్బిలి, రాజాం నెట్‌వర్క్


రామభద్రపురం అల్ మదీనా మసీదులో నమాజ్ చేస్తున్న ముస్లిం సోదరులు


బాడంగి: మండల కేంద్రంలోని మసీదులో ముస్లింల ప్రార్థనలు


రేగిడి: తాటిపాడు మసీదులో రంజాన్ ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు


రాజాం: ముస్లింలతో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొన్న తూర్పుకాపు సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సాయిబాబునాయుడు

బిల్లులు చెల్లించకపోవడం దారుణం


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: ఉపాధి హామీ పథకం వేతనదారులకు, సీసీ రోడ్లు, కాలువల నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడం దారుణమని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. ఇదే విషయమై ఆయన స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు బొబ్బిలి నియోజకవర్గంలో జరిగే ఉపాధి పనులకు బిల్లుల చెల్లింపులు సక్రమంగానే జరిగేవన్నారు. కేంద్రం చెల్లించే ఈ బిల్లుల్లో ఎప్పుడూ ఇప్పుడు ఉన్నంత జాప్యం లేదన్నారు. కొత్తగా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం మొదటి రెండు వారాలే బిల్లులు చెల్లించి, ఆ తర్వాత నుంచి నిలిపివేశారని ఆరోపించారు. పనులు చేయించుకుని, నెలల తరబడి బిల్లులు చెల్లించని సంస్కృతి గతంలో ఎన్నడూ లేదన్నారు. ఈ బిల్లులు చెల్లించకపోవడం చూస్తే ఉపాధి నిధులు వేరే పనులకు ఏమైనా చెల్లించారా అనే అనుమానం అందరిలో కలుగుతోందన్నారు. ఇప్పటికైనా ఉపాధి వేతనదారులకు, కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన బిల్లులు చెల్లించాలని కోరారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు, మాజీ మున్సిపల్ చైర్మన్ ఇంటి గోపాలరావు, తూముల భాస్కరరావు, శంబంగి వేణుగోపాలనాయుడు, వైస్ చైర్మన్లు చెలికాని మురళీకృష్ణారావు, రమాదేవి, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు చోడిగంజి రమేష్‌నాయుడు తదితరులు ఉన్నారు.

కౌన్సిలర్లపై చర్యలకు వెనకాడేది లేదు..

బొబ్బిలి: వైఎస్సార్ సీపీ టిక్కెట్‌పై కౌన్సిలర్లుగా గెలుపొందిన వారు డబ్బు, ఇతర ప్రలోభాలకు ఆశపడి వేరే పార్టీకి మద్దతు పలుకుతున్నట్లు తెలుస్తోందని, అటువంటి వారిపై చర్యలకు వెనకాడేది లేదని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు స్పష్టం చేశారు. స్థానిక పట్టణంలో మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు, వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లతో సోమవారం సమావేశమైన ఆయన.. సమావేశానికి కొంతమంది కౌన్సిలర్లు హాజరుకావడంపై ఆరాతీశారు. ఇన్నాళ్లూ అదిగో ఇదిగో అంటూ మాట్లాడిన ప్రతిపక్ష కౌన్సిలర్లు ఇప్పుడు మా వైపు ఇంతమంది ఉన్నారు.. అంతమంది ఉన్నారు.. అవిశ్వాస తీర్మానం పెడతామని మాట్లాడడం సరి కాదన్నారు. విశ్వాస ఘాతుకానికి పాల్పడిన వారిపై కచ్చితంగా చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. పార్టీ నుంచి వెళ్లే కౌన్సిలర్ల వార్డుల్లో ఇన్‌చార్జ్‌లను నియమిస్తామన్నారు.

కమ్యూనల్ అవార్డులు అమలు చేయండి

బొబ్బిలి: ప్రపంచ మేధావి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాధించి పెట్టిన కమ్యూనల్ అవార్డులను అమలు చేయాలని స్థానిక అంబేడ్కర్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సోరు సాంబయ్య డిమాండ్ చేశారు. ఇదే విషయమై ఆయన దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద సోమవారం ధర్నా చేపట్టారు. సమసమాజ భావన కలగాలన్నా, ఆర్థిక అసమానతలు తొలగాలన్నా, అందరూ సమానమేనన్న ఆలోచన ప్రతిఒక్కరూ చేయాలన్నా అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం, ఆయన కృషి ఫలితంగా పుట్టుకొచ్చిన కమ్యూనల్ అవార్డుల అమలు జరగాల్సిందేనన్నారు. దీనిపై ప్రభుత్వాలు స్పందించాలన్నారు. ఆయన వెంట ఎండ గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.


ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ధర్నా చేస్తున్న సోరు సాంబయ్య తదితరులు